మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం కానివ్వం

మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం కానివ్వబోమని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. అందుకోసమే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం కోటి సంతకాల సేకరణపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన 17 మెడికల్ కళాశాలల్లో కొన్ని పూర్తయ్యాయని, కొన్ని పూర్తి కావచ్చాయని తెలిపారు. వాటి విలువ రూ.లక్ష కోట్లు ఉంటుందన్నారు. అంత సొమ్ముతో కట్టిన కళాశాలలను చంద్రబాబు ప్రైవేట్‌కు ధారాదత్తం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారన్నారు. అలా చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించే అవకాశం ఎక్కడుంటుందని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యం ఏమైపోవాలని ప్రశ్నించారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయకుండా వైఎస్సార్‌సీపీ కోటి సంతకాలతో గవర్నర్‌కు వినతి పత్రాన్ని అందజేయనుందని వివరించారు. మైదుకూరు నియోజకవర్గంలో 60 వేల సంతకాలను సేకరించనున్నట్లు తెలిపారు. ఈనెల 28వ తేదీన మైదుకూరులో భారీ ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లి శివరాం, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, భరత్ కుమార్‌రెడ్డి, మహిళా విభాగం నియోజకవర్గం అధ్యక్షురాలు మాబు చాన్, బండి నాగేంద్ర ప్రసాద్, కౌన్సిలర్ వెంకటసుబ్బన్న, బీసీ విభాగం నాయకుడు ఇడగొట్టు శేషు, ఎంపీటీసీ ఇర్షాద్, పిల్లి నాగయ్య, రామదాసు, కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్, ఖాదర్, చొక్కం సంజీవరాయుడు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి ఏదీ?

మైదుకూరు మున్సిపాలిటీలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. మైదుకూరులో గతంలో 30 పడకల ఆస్పత్రి ఉండేదని వైఎస్ జగన్ ప్రభుత్వంలో మున్సిపాలిటీలో రెండు అర్బన్ పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారన్నారు. అందులో డాక్టర్లు, స్టాఫ్‌ను నియమించామని పేర్కొన్నారు. ఇప్పుడు కనీసం ఆ పీహెచ్‌సీలను సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శించారు. స్వయానా ఎమ్మెల్యే శివపురం వద్ద ఉన్న పీహెచ్‌సీ వద్దకు వెళ్లగా మూసి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 5 ఎకరాల భూమిని కేటాయించి పక్కా బిల్డింగ్స్‌కు నిధులు కూడా మంజూరు చేయించామన్నారు. పాలిటెక్నిక్ కాలేజీకి కూడా స్థల కేటాయింపు, నిధులు మంజూరు జరిగి టెండర్లు కూడా పిలిచారన్నారు. అంతలోనే ఎన్నికలు వచ్చాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో 2 వేల మంది ఇళ్లు లేని వారికి స్థలాలు ఇచ్చి పక్కా ఇళ్లను కట్టించామని తెలిపారు. మున్సిపల్ భవనాన్ని కట్టించామని, మున్సిపాలిటీలో డ్రైన్లు, సీసీ, బీసీ రోడ్లు వేశామన్నారు. ఒక్క ఇందిరమ్మ కాలనీలోనే రూ.2 కోట్లతో సీసీ రోడ్లు వేశామన్నారు. నంద్యాల రోడ్డులో ట్రాఫిక్ సమస్యగా ఉందని పశువుల సంతను గగ్గితిప్ప వద్దకు మారిస్తే, మళ్లీ అక్కడికే మార్చారని విమర్శించారు. ట్రాఫిక్‌తో ఎంత సమస్యగా ఉందో అందరికీ తెలుస్తోందని అన్నారు. మార్కెట్ యార్డు ఆవరణలో రైతు బజార్ ఏర్పాటుకు పనులు చేపట్టామని, కూటమి నాయకులు వాటిని పూర్తి చేసే చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

దేశభక్తి అలవర్చుకోవాలి

మైదుకూరు : విద్యార్థి దశ నుంచే దేశ భక్తి, సేవా భావం అలవర్చుకోవాలని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ ఎస్.సూర్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో గురువారం ఆయన ఎన్‌సీసీ విద్యార్థులకు 'ఏ' సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ ఎ.రాముడు మాట్లాడుతూ ప్రొద్దుటూరులోని మున్సిపల్ హైస్కూల్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 14న జరిగిన రాత పరీక్షల్లో తమ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొని ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. లెఫ్టినెంట్ కల్నల్ లలిత్ బాబు, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ మూడే సురేంద్రనాయక్, ఉపాధ్యాయులు జి.రామమోహన్, జి.పద్మనాభయ్య, ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

యానిమేటర్ పోస్టు ఎస్సీలకే ఇవ్వాలి

బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని నరసన్నపల్లె గ్రామంలో వెలుగు ఏపీఎం ఆధ్వర్యంలో యానిమేటర్ సమావేశం నిర్వహించిన తీరుపై ఎస్సీ డ్వాక్రా మహిళలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యానిమేటర్ పదవిని ఇప్పటి వరకు ఎస్సీ వర్గానికి చెందిన వారే నిర్వహిస్తూ వచ్చారని, ఇటీవల యానిమేటర్ పదవీ విరమణ చేసిన నేపథ్యంలో ఆ పోస్టును మళ్లీ ఎస్సీ అభ్యర్థికే ఇవ్వాలని వారు కోరారు. అయితే, ఆ అంశంపై ఎస్సీలను సంప్రదించకుండా, సమాచారం ఇవ్వకుండా.. అధికారులు, నాయకులు ముందస్తుగా నిర్ణయాలు తీసుకుంటూ మీటింగ్ నిర్వహించడం తమ హక్కులను కించపరిచే చర్యగా అభివర్ణించారు. స్వయం సహాయక సంఘాలు ఏర్పడినప్పటి నుంచి ఎస్సీలకే ప్రాధాన్యత ఇచ్చారని, ఎస్సీ అభ్యర్థులు అర్హులుండగా ఇతర వర్గాలకు అవకాశం కల్పించడం అన్యాయమని, ఇలా చేయడం సమానత్వ సూత్రానికి విరుద్ధమని వారు మండిపడ్డారు. గ్రామస్థాయి సమావేశాలు కూడా సక్రమంగా సమాచారం ఇచ్చి నిర్వహించాలి గానీ, ఒక వర్గాన్ని పక్కనబెట్టే విధంగా మీటింగ్‌లు పెట్టడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని వ్యాఖ్యానించారు. ఈ విషయంపై వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో గురువారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కాల్వ నాగేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ శారద భవాని, కోఆర్డినేటర్ వర్లపాడు గౌరీశంకర్, డైరెక్టర్ పృథ్వీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

కాశినాయన : మండలంలోని గంగనపల్లె సచివాలయం పంచాయతీ సెక్రటరీ పి.ఓబులేసు బదిలీపై వెళుతున్న సందర్భంగా గురువారం సచివాలయంలో ఆయనను సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ గురప్ప, డిజిటల్ అసిస్టెంట్ భీమయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

మైదుకూరు : చేతుల పరిశుభ్రత వల్ల ఆరోగ్యంగా ఉంటారని మున్సిపాలిటీ మేనేజర్ పరమేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఎస్ఓ విజయ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మైదుకూరు : పట్టణంలోని వనిపెంట రోడ్డులో గురువారం సాయంత్రం అర్బన్ సీఐ కె.రమణారెడ్డి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అంతకుముందు జీవీ సత్రంలోని శివచైతన్య పాఠశాలలో ఆయన విద్యార్థులకు సైబర్ క్రైం, మొబైల్ వినియోగం, ఇంటర్నెట్, సోషల్ మీడియా అంశాలపై అవగాహన కల్పించారు.

నకిలీ మద్యంపై ఎక్సైజ్ సురక్ష యాప్

మైదుకూరు : మద్యం నకిలీదా కాదా అని తెలుసుకునేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను వినియోగించాలని మైదుకూరు ఎక్సైజ్ సీఐ ధీరజ్ రెడ్డి తెలిపారు. ఇటీవల నకిలీ మద్యం దొరికిన కారణంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం చంద్రబాబు నాయుడు ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని సీఐ పేర్కొన్నారు. దీనిపై తాము అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని మద్యం సరైనదో కాదో పరిశీలించవచ్చని వివరించారు.

నేడు దంత వైద్య శిబిరం

చాపాడు : బద్రిపల్లె గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కడప రిమ్స్ దంత వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ అవకాశాన్ని బద్రిపల్లెతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆడ పిల్లల భద్రత అందరి బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం : ఆడ పిల్లల భద్రత మనందరి బాధ్యత అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని డ్రైవర్ కొట్టాలలో సేవ్ ది గర్ల్ చైల్డ్ క్యాంపెయిన్‌లో భాగంగా గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. సీఓ నాగజ్యోతి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బద్వేలు అర్బన్ : బద్వేలులోని 33/11 కె.వి.సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బద్వేలు పట్టణంతోపాటు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలు, వ్యవసాయ కనెక్షన్లకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ కుళాయప్ప, ఏఈలు మేరీషర్మిల, శివకుమార్ గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ముమ్మరంగా కోటి సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక ఒకటో వార్డులో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రజల నుంచి గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, వార్డు కౌన్సిలర్ పందిటి సరోజమ్మ, వార్డు నాయకులు సంతకాలు సేకరించారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన మున్సిపల్ చైర్మన్



సజ్జల రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి

అట్లూరు : బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చల్లా మధుసూదన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బద్వేలు మున్సిపల్ పట్టణ ప్రధాన కార్యదర్శి బీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న జేవీవీ, డీవైఎఫ్ఐ నాయకులు, ఉపాధ్యాయులు

అట్లూరు : అట్లూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు–2025 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక మండల కార్యదర్శి గౌరీశంకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు మాధ్యమాల్లో చెకుముకి సైన్స్ పరీక్షలు ఉంటాయన్నారు. ఈనెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12–14న రాష్ట్రస్థాయి పరీక్షలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాధర్, అయ్యవారప్ప, పాలకొండయ్య, చంద్రకళ, లక్ష్మీదేవి, వెంకటలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హౌసింగ్ పీడీ, మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకం ప్రచార కార్యక్రమం కోసం రూపొందించిన అంగీకార్ 2025 కార్యక్రమంపై గురువారం స్థానిక విద్యానగర్ ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ రాజారత్నం, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు నిర్మించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై 2.0 పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఇటువంటి పథకాలపై విద్యార్థులు చిన్నతనం నుంచి అవగాహన పెంచుకుని తల్లిదండ్రులను, చుట్టుపక్కల వారిని చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ లక్ష్మణస్వామి రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగానికి మేలు



జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బద్వేలు అర్బన్ : జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగం పుంజుకుంటుందని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు, అర్బన్ సీఐ ఎస్.లింగప్ప, వాణిజ్యపన్నులశాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎం.విజయలక్ష్మి పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎంవీఐ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐ, కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయ సిబ్బంది, వివిధ షోరూమ్‌ల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విరజానంద స్వామిజీ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని తోట్లపల్లె గ్రామస్తుడు కె.జీవన్‌కుమార్ దర్శకత్వంలో స్వయంగా రూపొందించిన బుజ్జులయ్య ప్రెజెంట్స్ వారి 'కోడి పాయే లచ్చన్నది' షార్ట్ ఫిల్మ్ పోస్టర్‌ను అచలానంద ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ విరజానంద స్వామిజీ గురువారం ఆవిష్కరించారు. షార్ట్ ఫిల్మ్ నిర్మించిన వారిని, తారాగణం, సాంకేతిక నిపుణులను ఆయన ఆశీర్వదించారు. ఈ షార్ట్ ఫిల్మ్ దీపావళి సందర్భంగా తోట్లపల్లె టాలెంట్స్ అనే యూట్యూబ్ చానెల్‌లో విడుదల కానుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నటులు హరి, శ్రీకాంత్, సుభాష్, సురేంద్ర, భాగ్యరాజు, సందీప్, అనిల్, బాల బ్రహ్మయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.